సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



**ప్రకృతితో మమేకం!**

పట్టణీకరణకు దూరంగా జీవనం సాగించే ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూనే ఉన్నారు. 10లో



**కొరత తీరినట్లే...**

ఉమ్మడి జిల్లాలో స్టాంప్ పేపర్ల కొరత ఏర్పడకుండా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 24°

**వాతావరణం**

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుంది. కొన్ని చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### కల్యాణం... కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### నేటి నుంచి రెండు రైళ్లు రద్దు



కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్(కొత్తగూడెం) నుంచి నడిచే రెండు రైళ్లు గురువారం నుంచి రద్దు చేస్తున్నట్లు చీఫ్ కమర్షియల్ అధికారి జేమ్స్‌పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున నడిచే సింగరేణి ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 8 వరకు, కాకతీయ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 7 వరకు రద్దు చేశామని, వరంగల్‌లో జరుగుతున్న మరమ్మతుల పనుల నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

# అప్‌గ్రేడ్ అయ్యేనా?



భద్రాచలం పట్టణ వ్యూ

## భద్రాచలం మున్సిపాలిటీపై మళ్లీ చర్చ

- ముబుగు కోసం మంత్రి సీతక్క ప్రయత్నాలతో ఇక్కడా ఆశలు
- సందిగ్ధతపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- ఊగిసలాటలో పవిత్ర పుణ్యక్షేత్రం
- పట్టింపులేని ప్రజాప్రతినిధులు, నాయకులు

భద్రాచలం: ములుగు జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా మార్చాలని మంత్రి సీతక్క చేస్తున్న ప్రయత్నాలతో భద్రాచలాన్ని కూడా అప్‌గ్రేడ్ చేస్తారా అనే అంశంపై మళ్లీ చర్చ మొదలైంది. గతంలో భద్రాచలంతో పాటు ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటన చేసింది. దీంతో ఆయా కేంద్రాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. అయితే ప్రత్యేక ఏజెన్సీ చట్టాల ప్రకారం భద్రాచలాన్ని మున్సిపాలిటీగా మార్చొద్దని ఆదివాసీ సంఘం నాయకులు సోందె వీరయ్య హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పలుమార్లు వాదనల అనంతరం.. భద్రాచలాన్ని మున్సిపాలిటీ లేదా గ్రామపంచాయతీగా ప్రకటించి అత్యవసరంగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో భద్రాచలాన్ని మూడు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ చట్ట సవరణ చేసి గవర్నర్ ఆమోదానికి పంపింది. కాగా, నాటి గవర్నర్ తమిళిసై రెండుసార్లు కూడా తిరస్కరించారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో భద్రాచలాన్ని ఒకటే పంచాయతీగా కొనసాగించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా సిద్ధం చేయాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

**ములుగులో లేని అడ్డంకులు ఇక్కడెందుకు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ములుగు జిల్లా కేంద్రాన్ని కూడా మున్సిపాలిటీగా మారుస్తూ చట్ట సవరణ చేసి గవర్నర్ ఆమోదానికి పంపింది. అయితే తమిళిసై ఆ బిల్లును సైతం ఆమోదించకుండా రాష్ట్రపతి వద్దకు పంపించారు. తాజాగా ములుగు ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆ బిల్లును ఆమోదించాలని, జీఎహెచ్ఎంసీ చట్ట సవరణ బిల్లును సవరించాలని ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో కలిసి విన్నవించారు. దీంతో భద్రాచలం మున్సిపాలిటీపై బుధవారం స్థానికంగా చర్చ జరిగింది. అదే ఏజెన్సీ చట్టం ఉన్న ములుగు మున్సిపాలిటీగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రాచలంలో మాత్రమే అడ్డంకులు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. దక్షిణ అయోధ్యగా పేరెన్నిక కలిగిన పుణ్యక్షేత్రానికి తోడు టూరిజం కారిడర్‌కు కేంద్రంగా భద్రాచలం విరాజిల్లుతోంది. ఇటు ఆధ్యాత్మిక, అటు టూరిజం హబ్‌గా ఉన్న భద్రాచలంలో జనాభా సైతం నానాటికి పెరుగుతూ సుమారు లక్షకు చేరుకుంది.

**ఏళ్లుగా ఊగిసలాటే..**

గ్రామపంచాయతీగా ఉన్న భద్రాచలాన్ని 2002లో నాటి ప్రభుత్వం టౌన్‌షిప్‌గా ప్రకటించింది. 2005లో మున్సిపాలిటీగా ప్రకటించి కమిషనర్‌ను నియమించి పాలన కొనసాగించింది. అయితే ఆదివాసీ సంఘాల నాయకులు కోర్టును ఆశ్రయించడంతో 2008లో తిరిగి గ్రామపంచాయతీగా ప్రకటించి ఎన్నికలు నిర్వహించింది. ఈ పాలకవర్గం గడువు 2014లో ముగియగా.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం ప్రాముఖ్యత దృష్ట్యా తిరిగి మున్సిపాలిటీగా ప్రకటించింది. అయితే మళ్లీ ఆదివాసీ సంఘాల నాయకులు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం మున్సిపాలిటీ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. అప్పటి నుంచి భద్రాచలానికి పాలకవర్గమే లేకుండా పోయింది. కాగా, మేజర్ గ్రామపంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ మేరకు అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలోనే ములుగు మున్సిపాలిటీ ప్రతిపాదన గవర్నర్ వద్దకు చేరడంతో భద్రాచలంపైనా ఆశలు చిగురిస్తున్నాయి. మున్సిపాలిటీగా ప్రకటిస్తే శరవేగంగా అభివృద్ధి చెందుతుందని కొందరు వాదిస్తుండగా, ఇది గిరిజన చట్టాలకు విఘాతం కలిగించడమేనని మరి కొందరు అంటున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా భద్రాచలం మున్సిపాలిటీ అంశం ఆకాశంలోనే ఊగిసలాడుతూ అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయింది. అయితే ఇరు వర్గాలను సమన్వయ పరుస్తూ భద్రాచలాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించేలా తగు నిర్ణయం తీసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు మాత్రం రెండు నాల్కల ధోరణిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇరువర్గాలకూ ఎవరి మాట వారికే చెబుతూ పబ్బం గడుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేసి యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్



నృత్య ప్రదర్శన చేస్తున్న యువతులు

**కలెక్టర్ జితేష్ వి పాటిల్**

సింగరేణి(కొత్తగూడెం): స్వామి వివేకానంద జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాలకు ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత సంకల్పిస్తే ఏ పనైనా సాధ్యమేనని, అందరికీ ఆదర్శంగా ఉంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొమురంభీం వంటి వారు కూడా అటవీ ప్రాంత జిల్లాల్లోనే తిరిగారని, రుద్రమదేవి ఆనవాళ్లు చంద్రుగొండ గుట్టలపై నేటికీ కనిపిస్తున్నాయని చెప్పారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లా అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి..**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పాటిల్ అన్నారు. ఐడీఓసీలో రోడ్డు భద్రతపై బుధవారం ఎస్పీ రోహిత్‌రాజ్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలతో ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకుండా, ప్రాణాలు కోల్పోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల వివరాలు నమోదు చేయాలన్నారు. రోడ్లపై కేజీ వీల్స్ తిరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాల్లో పోలీసు కళాబృందాలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని రవాణాశాఖాధికారి సదానందానికి సూచించారు.

**పారిశుద్ధ్య కార్మికుల సేవలు కీలకం..**

పాల్వంచ: సమాజంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు కీలకమైనవని, ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతకు ఎంతో కృషి చేస్తుంటారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్య చర్యలు చేపట్టే కార్మికులు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తిస్తుందని, వారికి పలు సంక్షేమ కార్యక్రమాల్లో ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు.

**ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ..**

పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. వార్డులు, ల్యాబ్, ఎక్స్‌రే, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. అనంతరం పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్‌ను త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై డీసీహెచ్ఎస్ రవిబాబును అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీవైఎస్ఓ పరంధామరెడ్డి, సైన్స్ అధికారి చలపతిరాజు, డీఐఈఓ వెంకటేశ్వర్లు, మైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, పీఆర్, ఆర్అండ్‌బీ, గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, తానాజి, మున్సిపల్ కమిషనర్ ధాకూ నాయక్, పాల్వంచ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

# రసాయనిక ఎరువులు తగ్గించండి

- అధిక లాభాలు వచ్చే పంటలు సాగు చేయాలి
- డీఏఓ బాబూరావు, సీపీఓ సంజీవ్‌రావు



సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

గుండాల: రైతులు నిత్యం సాగు చేసే పంటలతో పాటు అధిక లాభాలు అందించే పంటలను ఎంచుకుని వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, సీపీఓ సంజీవ్‌రావు అన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్(సంపూర్ణతా అభియాన్)కార్యక్రమంలో భాగంగా బుధవారం గుండాల రైతు వేదికలో సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట మార్పిడి పాటించాలని, రసాయనిక ఎరువుల వాడక వల్ల భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గుతుందని తెలిపారు. ప్రతీ రైతు పశువుల పెంటతో పాటు కంపోస్ట్ ఎరువులను తయారు చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పత్తి, మొక్కజొన్న, మిర్చి, వరితో పాటు ఇతర పంటలపై కూడా మక్కువ చూపాలన్నారు. మండలంలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని, విద్యుత్ సౌకర్యం కూడా ఉందని అన్నారు. మండలంలోని ప్రతీ రైతు ఆయిల్ పాం, మునగ, టేకు, వెదురు, పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. ఆస్పిరేషనల్ బ్లాక్‌లో గుండాల మండలం ఉన్నందున జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు. పంటలతో పాటు చేపలు, గొర్రెలు, కోళ్ల పెంపకాలు కూడా చేపట్టాలని సూచించారు. ఆధునిక యంత్రాలతో వ్యవసాయం అభివృద్ధి చెందిందని, రైతులు కూడా అన్ని రకాల పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడి పొందాలని అన్నారు. హెల్త్ కార్డుల ఉపయోగం, పంటల సాగు పద్ధతి, ఎరువుల తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 1195 మంది రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందించారు. కార్యక్రమంలో ఇల్లెందు, మణుగూరు ఏడీఏలు లాల్ సింగ్, తాతారావు, కేవీకే కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, ఏఓ వెంకటరమణ, ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ నవనీత్, తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ సత్యనారయణ, ఏఈఓలు బాలరాజు, లెనిన్ పాల్గొన్నారు.

## జమలాపురం హుండీ ఆదాయం రూ.29.51లక్షలు



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ, తదితరులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరస్వామి, ఈఓ కె.జగన్మోహన్‌రావు లెక్కించగా 91 రోజులకు గాను రూ.29,51,477 ఆదాయం నమోదైంది. ఆతర్వాత వచ్చే నెల 3వ తేదీ నుండి ఆలయంలో నిర్వహించనున్న శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వాగొడ్డుగూడెం వద్ద గల వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతంలోని ఊట్లపల్లి వద్ద వెంకమ్మ చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు పోస్తోంది. దీంతో దిగువన ఉన్న వాగొడ్డుగూడెం లోలెవల్ చప్టా మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో వాగొడ్డుగూడెం నుంచి అశ్వారావుపేటకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



నిండుకుండను తలపిస్తున్న కిన్నెరసాని రిజర్వాయర్



వాగొడ్డుగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

## గరిష్ట స్థాయికి చేరిన కిన్నెరసాని

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 1000 క్యూసెక్కుల వరద నీటితో బుధవారం గరిష్ట స్థాయికి చేరింది. నీటిమట్టం ఈ మేరకు పెరగడం ఈ ఏడాది ఇదే తొలిసారి. రిజర్వాయర్ పూర్తిగా నిండడంతో రెండు గేట్లు ఎత్తి 7వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్‌సైడ్ ఇంజనీర్ తెలిపారు.

# ఈ సారి.. సగమే!

- చేప పిల్లల పంపిణీని తగ్గించిన ప్రభుత్వం
- గతేడాది 1.76 కోట్లు.. ఈ సంవత్సరం 86 లక్షలే
- ఇది సరికాదంటున్న మత్స్యకారులు
- ఈ నెలాఖరు నాటికి చెరువుల్లోకి విడుదల



కిన్నెరసానిలో చేపపిల్లలు పోస్తున్న మత్స్యకారులు, అధికారులు (ఫైల్)

పాల్వంచరూరల్ : జిల్లాలోని చెరువులు, వాగులు, కుంటల్లో ప్రభుత్వం విడుదల చేసే ఉచిత చేప పిల్లల పంపిణీ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మత్స్యకారులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. గతేడాది 1.76 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసిన సర్కారు.. ప్రస్తుతం 86 లక్షల పిల్లలను మాత్రమే పోయాలని, అది కూడా ప్రభుత్వం గుర్తించిన పెద్ద చెరువులకే పరిమితం చేయాలని మత్స్యశాఖ కమిషనర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఆయా చెరువుల పరిధిలోని మత్స్య సంఘాలకు ఈనెలాఖరు నాటికి చేప పిల్లలు పంపిణీ చేసేలా కసరత్తు చేస్తున్నారు. అయితే చిన్న చెరువులు, కుంటలపై ఆధారపడిన సంఘాలు తమ పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.

**ప్రైవేటుగా కొనుగోలు..**

ఇటీవలి వర్షాలతో జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండి జలకళ సంతరించుకున్నాయి. ఈ సమయంలో చేప పిల్లలు వదిలితే వచ్చే వేసవి కాలం నాటికి బాగా పెరుగుతాయని, ఆశించిన లాభాలు వస్తాయని మత్స్యకారులు అంటున్నారు. కాగా, ప్రభుత్వ పంపిణీ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని భావించిన పలు మత్స్య సంఘాల వారు ఆర్థికంగా భారమైనప్పటికీ సభ్యులంతా తలా కొంత నగదు పోగు చేసుకుని పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేటుగా చేప పిల్లలు కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో వదిలారు.

**కొన్ని రకాల పిల్లలే..**

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు గత ప్రభుత్వం ఉచితంగా వివిధ రకాల చేప పిల్లలను పంపిణీ చేసింది. ఇందులో ప్రధానంగా బొచ్చె, రవ్వ, బంగారుతీగ, మిడిగాల తదితర రకాలు ఉండేవి. అయితే ఈ సంవత్సరం చేప పిల్లల పంపిణీని సగం మేర తగ్గించడంతో కొన్ని రకాల పిల్లలను మాత్రమే చెరువుల్లో వదిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక కొన్ని సంఘాలు సొంతంగా కొనుగోలు చేసినా.. వారు సైతం ఆర్థిక భారం భరించలేక ఒకటి, రెండు రకాల పిల్లలను మాత్రమే తీసుకొచ్చారు. బొచ్చె, రవ్వ రకాల పిల్లలను చెరువుల్లో పోసుకున్నారు.

**అధికారుల తర్జనభర్జన..**

జిల్లాలో మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు నీటి వసతి గల చెరువులు, కుంటల్లో ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయాలని గత జూలైలోనే మత్స్య శాఖ అధికారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది జిల్లాలోని 734 చెరువుల్లో 1.76 కోట్ల పిల్లలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. శీలావతి, బంగారుతీగ, బొచ్చె రకాల పిల్లలు 80 నుంచి 100 మి.మీ.సైజు గల వాటిని జలాశయాల్లో పోయాలని, 35 నుంచి 40 మి.మీ. పిల్లలను చెరువులు, కుంటల్లో వదలాలని ప్రణాళిక రూపొందించారు. అయితే ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు అమోదించలేదు. జిల్లాకు 86 లక్షల పిల్లలు మాత్రమే పంపిణీ చేస్తామని చెప్పడంతో వీటిని ఏయే మండలాలకు ఎంత మేర కేటాయించాలోనని అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

**సర్కారు పునరాలోచన చేయాలి**



జిల్లాలో పుష్కలమైన జలవనరులు ఉన్నాయి. ప్రభుత్వం ప్రతీ సంవత్సరం కోటికి పైగా చేప పిల్లలు పంపిణీ చేస్తుంటే మత్స్యకారులకు ఎంతో కొంత ఉపాధి లభించేది. ఈసారి 86 లక్షలు మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించడం సమంజసంగా లేదు. ఈ విషయమై సర్కారు పునరాలోచన చేయాలి. జిల్లాలోని పెద్ద చెరువుల్లోనే పిల్లలు పోస్తే చిన్న చెరువులు, కుంటలపై ఆధారపడిన వారు పీడిన పడాల్సిందే.

–ఊదర వెంకటస్వామి,
ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి

**ఈ నెలఖారు వరకు పంపిణీ చేస్తాం**



ఈనెలాఖరుకల్లా ఉచిత చేపపిల్లల పంపిణీ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించాం. అయితే ఈసారి 86 లక్షల పిల్లల పంపిణీకి మాత్రమే అనుమతులు వచ్చాయి. వీటిని ఏయే మండలాల్లో పంపిణీ చేయాలనేది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. వారి సూచనలు, సలహాల మేరకు పంపిణీ ప్రక్రియ జరుగుతుంది.

– ఎండీ.ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్,
జిల్లా మత్స్యశాఖాధికారి

## మార్కెట్లోనే క్రయవిక్రయాలు జరపాలి

వ్యాపారులకు డీఎంఓ ఆదేశం



మాట్లాడుతున్న డీఎంఓ నరేందర్

ఇల్లెందు: ఈ సీజన్‌లో మార్కెట్‌లోనే క్రయవిక్రయాలు సాగాలని, లైసెన్స్ పొందిన ప్రతీ వ్యాపారి ఈ మేరకు సన్నద్ధం కావాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్ అన్నారు. బుధవారం ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మార్కెట్ పరిధిలో తొమ్మిది మండలాలు ఉండగా అన్ని చోట్లా మార్కెట్ గోదాంలు ఉన్నాయని, ఎక్కడికక్కడే కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బయ్యారం, గార్ల, కారేపల్లి, కామేపల్లి, టేకులపల్లి, గుండాలలో గోదాంలు ఉన్నాయని తెలిపారు. మార్కెట్ సిబ్బంది సహకారంతో అక్కడే కొనుగోళ్లు జరిగేలా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఇకపై ఇల్లెందు మార్కెట్ పరిధిలోని సరుకు ఇతర ప్రాంతాలకు తరలకుండా అన్ని రోడ్లు మూసేస్తామని, చెక్‌పోస్టుల సంఖ్య పెంచుతామని వివరించారు. ఇల్లెందు మార్కెట్ పరిధిలో 54 మంది లైసెన్స్‌డ్ వ్యాపారులు ఉన్నారని, వారంతా మార్కెట్‌లోనే కొనుగోలు చేసేలా తనిఖీలు చేస్తామని తెలిపారు. అనధికారికంగా కొనుగోలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుర. సమావేశంలో స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ సుజిత, గ్రేడ్–3 సెక్రటరీ నరేష్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారుల త్రైపాక్షిక సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారుల త్రైపాక్షిక సమావేశం, పెన్షన్ అదాలత్ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మిల సమస్యలపైనే కాక సీఎంపీఎఫ్, పింఛన్ క్లెయిమ్‌ల పరిష్కారంపై చర్చించారు. 2023–24 సంవత్సరానికి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ స్లిప్‌ల పంపిణీ ఇతర సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సీఎంపీఎఫ్ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో సింగరేణి జీఎంలు ఎం.సుబ్బారావు, సామ్యేల్ సుధాకర్, కవితా నాయుడు, సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ రెహమాన్ సూచించారు. కొత్తగూడెంలో బాలికల కిడ్నాప్ జరిగిందనే సమాచారం అందిన వెంటనే కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌తో కలిసి బుధవారం పట్టణ పరిధిలోని బూడిదగడ్డ ఏరియాకు చేరుకున్నారు. ఈ క్రమంలో కొద్ది సేపటికే మున్సిపల్ ఏఈ రాము పిల్లలు, కుటుంబ సభ్యులతో ఇంట్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో కథ సుఖాంతమైనప్పటికీ, ఈ ఘటన ఒక గుణపాఠంగా తీసుకొని బస్తీలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని డీఎస్పీ రెహమాన్.. స్థానికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

### ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. బుధవారం ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వరరావు (22) ట్రాక్టర్‌పై పామాయిల్ గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తరలిస్తున్నాడు. పాపిడిగూడెం – అశ్వారావుపేట మార్గ మధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ యయాతిరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అశ్వారావుపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అశ్వాపురం: మండలంలోని వెంకటాపురం జీపీ మామిళ్లవాయికి చెందిన సోయం సత్యం (20) పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మద్యానికి బానిసైన సత్యం.. మత్తులో పురుగులమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లతో పోలీసులు

చండ్రుగొండ: మండలంలోని అయ్యన్నపాలెం వద్ద మంగళవారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గంజి స్వప్న తెలిపారు. ఎదుళ్లవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

### కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఆదర్శనగర్‌కాలనీకి చెందిన బత్తులశాంతికి 2014లో మణుగూరుకు చెందిన సాంబశివరావుతో వివాహమైంది. మూడేళ్లుగా అదనపు కట్నం కోసం సాంబశివరావు తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బత్తుల శాంతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేశారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.14,392 |

# కొరత తీరినట్లే...



ఉమ్మడి జిల్లాలో స్టాంప్ పేపర్ల కొరత ఏర్పడకుండా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మునుపెన్నడూ లేని విధంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.32.26 కోట్లకు పైగా విలువైన స్టాంపు పేపర్లు చేరాయి. ఈ నిల్వలు రెండేళ్ల కాలానికి సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్

- ఉమ్మడి జిల్లాకు భారీగా స్టాంప్‌లు, స్టాంప్ పేపర్లు
- రెండేళ్ల కాలానికి సరిపడా నిల్వలు
- వెండర్లు కృత్రిమ కొరత సృష్టించకుండా చర్యలు

**కృత్రిమ కొరత సృష్టించకుండా..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, వీటి పరిధిలో 160 మంది స్టాంప్ పేపర్లు విక్రయిస్తుంటారు. ఇటీవల జిల్లాలో స్టాంప్ పేపర్ల నిల్వలు తగ్గడంతో కృత్రిమ కొరత సృష్టించిన వెండర్లు అధిక ధరలకు విక్రయించడం మొదలు పెట్టారు. మండల కేంద్రాల్లో రూ.100 స్టాంప్ పేపర్‌ను రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు అమ్ముతుండడంతో అధికారులు భారీగా స్టాంప్ పేపర్లను తెప్పించారు.

**అన్ని డినామినేషన్లు...**

కోర్టు ఫీజుకు అవసరమైన రూ.1, రూ.2, రూ.5 స్టాంపులతో పాటు రూ.20, రూ.50, రూ.100 విలువైన నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లు, రూ.10విలువైన నోటరీ స్టాంప్ పేపర్లే కాక రూ.1విలువైన రెవెన్యూ స్టాంపులను తెప్పించగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో నిల్వ చేశారు. వీటిని జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరవేసి, వాటి పరిధిలోని స్టాంప్ వెండర్లకు కేటాయించనున్నారు.

**రూ.10 స్టాంప్ పేపర్లు అత్యధికం**

ఉమ్మడి జిల్లాకు రూ.32.26 కోట్లకు పైగా విలువైన స్టాంప్‌లు, స్టాంప్ పేపర్లు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రూ.10 విలువైన నోటరీ స్టాంప్ పేపర్లు 5.40 లక్షల మేర ఉన్నాయి. రూ.20 స్టాంప్ పేపర్లు 3.60 లక్షలు ఉండగా, రూ.100 విలువైనవి 3.04 లక్షలు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10, రూ.20, రూ.100 స్టాంప్ పేపర్లను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇవి అధిక మొత్తంలో రావడంతో కొరత తీరినట్లేనని చెబుతున్నారు.

**స్టాంప్‌లు, స్టాంప్ పేపర్ల సంఖ్య, వాటి విలువ**

| స్టాంప్‌లు, స్టాంప్ పేపర్లు | సంఖ్య | విలువ (రూ.ల్లో) |
|---|---|---|
| రూ.1 (కోర్టు ఫీజు) | 1,60,000 | 1,60,000 |
| రూ.2 (కోర్టు ఫీజు) | 2,64,000 | 5,28,000 |
| రూ.5 | 2,56,000 | 12,80,000 |
| రూ.20 | 3,60,000 | 72,00,000 |
| రూ.50 | 56,000 | 28,00,000 |
| రూ.100 | 3,04,000 | 30,40,40,000 |
| రూ.10 | 5,40,000 | 54,00,000 |
| రూ.1 (రెవెన్యూ స్టాంపులు) | 12,80,000 | 12,80,000 |



# 20ఏళ్ల సంబరాలు ఎవరికోసం ?

**మావోయిస్టు పార్టీని ప్రశ్నిస్తూ ఆదివాసీ సంఘాల పేరిట పోస్టర్లు**

చర్ల: మావోయిస్టు పార్టీ 20 సంవత్సరాల సంబరాలు ఎవరికోసం, ఎందుకోసం జరుపుకుంటోందని ప్రశ్నిస్తూ ఆదివాసీ హక్కుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరిట చర్ల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం పోస్టర్లు, కరపత్రాలు వెలిశాయి. రహదారి సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యం బారిన పడిన వారిని ఆదివాసీలు జోలె కట్టి మోసుకొస్తున్న, రహదారులపై మావోయిస్టులు మందుపాతరలు పేల్చడంతో ఏర్పడిన గుంతల ఫొటోలతో ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలు దర్శనమిచ్చాయి. 'మావోయిస్టులు మా ఆదివాసీల గుంపులకు ఎక్కడైనా నీటి సౌకర్యం కల్పించారా, ఏ ఊళ్లోనైనా పాఠశాల కట్టించారా, ఏ ఊరికైనా రోడ్డు వేయించారా, ఏ ఊళ్లోనైనా వైద్య సదుపాయం కల్పించారా, ఎంత మంది ఆదివాసీ బిడ్డలకు చదువు చెప్పించారు, ఎంత మందికి మీ వల్ల ఉద్యోగాలు వచ్చాయి, మీ వల్ల మా ఆదివాసీ బిడ్డల జీవితాలు బాగుపడ్డాయా, మా గ్రామాలకు రోడ్లు లేకుండా చేసింది మీరు కాదా' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.



ఆదివాసీ హక్కుల సంఘం పేరిట వెలసిన పోస్టర్

# మూడో రోజూ కొనసాగిన నిరసన



నిరసన తెలుపుతున్న ఇంజనీర్ల సంఘాల బాధ్యులు

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో నిర్మించ తలపెట్టిన థర్మల్ పవర్ స్టేషన్‌ను సింగరేణితో జాయింట్ వెంచర్ కాకుండా జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా మూడో రోజు బుధవారం కేటీపీఎస్ 7వ దశ మెయిన్ గేటు ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రామగుండంలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించే స్థలం జెన్‌కోదేనని, సింగరేణితో కలిసి నిర్మించడం వల్ల జెన్‌కో మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కేటీపీఎస్ 7వ దశ 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ దేశంలోనే అత్యధిక పీఎల్‌ఎఫ్ సాధిస్తూ నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఇప్పటి వరకు ఇంజనీర్లు మాత్రమే నిరసన తెలపగా గురువారం నుంచి ఉద్యోగ, కార్మిక సంఘాలు సైతం ఆందోళన బాటపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మంగీలాల్, మధుబాబు, బ్రహ్మాజీ, యాకూబ్, మహేశ్, శ్రావణ్ బాబు, రవి, శ్రీకాంత్, రాజేశ్, నరేందర్, నవీన్, ఉపేందర్, యాస్మిన్, శ్రీనిధి, అనూష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో విద్యుత్ గృహోపకరణాలు దగ్ధం

రఘునాథపాలెం: పిడుగుపాటు కారణంగా ఓ ఇంట్లో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పరిధి జగ్యాతండాలోని బానోత్ నాగేశ్వరరావు ఇంటిపై మంగళవారం రాత్రి పిడుగు పడిది. ఈ ఘటనలో విద్యుత్ మీటర్ పక్కన ఉన్న స్విచ్ బోర్డ్ కాలిపోవడమే కాక టీవీ, ఫ్రిడ్జి, వాషింగ్ మిషన్, ఏసీ, వాటర్ ప్యూరిఫైర్, ఫ్యాన్లు కాలిపోయాయని నాగేశ్వరరావు తెలిపారు. ఘటనలో సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని పేర్కొనగా, పంచాయతీ కార్యదర్శి కృష్ణ బుధవారం ఉదయం పరిశీలించారు. కాగా, పిడుగు పడిన సమయాన కుటుంబీకులంతా ఇంట్లోనే ఉన్నా ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## యువజనోత్సవాల్లో వ్యవసాయ విద్యార్థుల ప్రతిభ

అశ్వారావుపేట: జిల్లా యువజనోత్సవాల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ బుధవారం తెలిపారు. వ్యాసరచనలో లేఖన మొదటిస్థానం, డిక్లమేషన్‌లో హర్షిత 2వ స్థానం, యస్మీన్ 3వ స్థానం, సైన్స్ మేళాలో బయో కంట్రోల్ యూనిట్‌కు 2వ స్థానం, గ్రూప్ డాన్స్‌లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక, గ్రూప్ సాంగ్‌లో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. బోధనా సిబ్బంది డాక్టర్ పావని, రెడ్డిప్రియ, జగదీశ్ విద్యార్థులను యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు సమన్వయపరచగా వారికి అభినందనలు తెలిపారు.



యువజనోత్సవాల్లో గెలుపొందిన విద్యార్థులు

## ఉత్సాహంగా అండర్-19 టీ.టీ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 జూనియర్ కళాశాలల క్రీడల్లో భాగంగా బుధవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. పోటీలకు 40మంది క్రీడాకారులు హాజరుకాగా బాలుర విభాగం నుంచి పరిటాల జ్వలిత్, సోడియం రాధాకృష్ణ, సాయి, మోహిత్‌కృష్ణ, తరుణ్ విజేతలుగా నిలిచారు. ఇక బాలికల విభాగంలో పి.శ్రీఅమృత, నవ్య, భానోత్ కుమారి, సుప్రియ, చంద్రిక రాణి విజేతలుగా నిలవగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమమార్, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు చలపతిరావు, జానీపాషా, వీవీఎస్.మూర్తి, ఎం.డీ. మూసాఖాలీం బహుమతులు అందజేశారు.



విజేతలతో డీవైఎస్‌ఓ, అసోసియేషన్ బాధ్యులు

## బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని ఖమ్మం డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన సునీల్ ఒడిశా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి బస్సులో బయలుదేరాడు. ఖమ్మంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద డీటీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా ఆయన నుంచి రూ.1.60లక్షల విలువైన 25కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ కరుణశ్రీ, ఎస్‌ఐ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



చెన్నారావు (ఫైల్)

సత్తుపల్లిరూరల్: గొర్రెలను మేతకు తీసుకెళ్లి వస్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కాకర్లపల్లికి చెందిన కొప్పుల చెన్నారావు(53) తన భార్య కుమారితో కలిసి మంగళవారం గొర్రెలను మేపుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా రుద్రాక్షపల్లి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలైన చెన్నారావును విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉండగా, ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

## రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి..

చింతకాని: చింతకాని–పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (40) బుధవారం రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న రైలు నుంచి ఆయన జారిపడ్డాడు. ఛామనఛాయ రంగు కలిగిన వ్యక్తి ఛాతిపై పుట్టుమచ్చ ఉండగా, తెల్లని కట్ బనియన్, నల్లని లోయర్ ధరించి ఉన్నాడు. ఇతర ఆధారాలు లభించకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

## ఫ్లైఓవర్‌పై నిలిచిన నీరు... కారుకు ప్రమాదం

నేలకొండపల్లి: జాతీయ రహదారి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ఫ్లైఓవర్‌పై నీరు నిలిచి ప్రమాదం జరిగిందని పలువురు టోల్‌గేట్ వద్ద ఆందోళనకు దిగారు. కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి మీదుగా ఖమ్మంకు చెందిన జె.కృష్ణ కారులో మంగళవారం రాత్రి కోదాడ వెళ్తున్నాడు. నేలకొండపల్లి మండలం బోదులబండ క్రాస్‌లోని ఫ్లైఓవర్‌పై నీరు నిలిచి ఉండడంతో ఆయన కారు గోడకు గుద్దుకుని ప్రమాదం జరిగింది. ఇంతలోనే వెనుక నుంచి వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో పైనంపల్లి టోల్‌గేట్ వద్దకు వెళ్లిన బాధితులు నిర్వాహకులను నిలదీశారు. హైవే పనులు అసంపూర్తిగా ఉన్నప్పటికీ టోల్ వసూలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కాగా, హైవే అధికారులు, కాంట్రాక్టర్, టోల్‌గేట్ నిర్వాహకులపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

## వైరాలో ఆగని ఆక్రమణలు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజులుగా ప్రభుత్వ స్థలాలను పలువురు ఆక్రమించుకుని గుడిసెలు వేస్తుండగా అడ్డుకుంటున్నారు. అయినా బుధవారం కూడా 13, 14వ వార్డుల్లో గతంలో ఉన్న ఎన్నెస్పీ కాల్వపై గుడిసెలు వేసేందుకు కొందరు ప్రయత్నం చేయగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. శాంతినగర్ నుండి అయ్యప్ప స్వామి దేవాలయం వరకు ఎన్నెస్పీ స్థలాలు ఆక్రమించుకునేందుకు చుట్టూ తాళ్లు, తీగలు కట్టి హద్దులు నిర్ణయించుకోవడం గమనార్హం. ఈసందర్భంగా ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది చేరుకుని అక్కడ ఉన్న వారిని హెచ్చరించారు. ఆపై మధిర రోడ్డు నుండి శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్ స్కూల్ పాఠశాల వరకు సర్వే చేశారు. ఇప్పటికే 33 మంది స్థలాలు ఆక్రమించుకుని భవనాలు నిర్మించుకున్నందున నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## మద్యం దుకాణంలో ఇరువర్గాల ఘర్షణ

నేలకొండపల్లి: మద్యం దుకాణంలో పలువురు ఘర్షణ పడిన ఘటన ఇది. మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో బుధవారం ఇరువర్గాల వారు మద్యం సేవిస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ విషయమై పంచాయితీ జరిగింది. ఈ నేపథ్యాన ముదిగొండకు చెందిన ముగ్గురు, నేలకొండపల్లి మండలం బైరవునిపల్లికి చెందిన ఇరువురి మధ్య వివాదం పెరిగి మద్యం మత్తులో ఉన్న వారు వీరంగం సృష్టించారు. ఇరువర్గాల వారు సీసాలతో కొట్టుకున్నట్లు తెలియగా, ముదిగొండ మండలం యడవల్లి లక్ష్మీపురానికి చెందిన వంశీ, బైరవునిపల్లికి చెందిన కె.భానుకు తీవ్ర గాయాలయ్యారు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకున్నారు.

## తమ్మిలేరులో వ్యక్తి గల్లంతు?

వేంసూరు: మండలంలోని కందుకూరు తుంగవారి కాలనీకి చెందిన తుంగ రామారావు తమ్మిలేరులో గల్లంతైనట్లు తెలిసింది. ఆయన బుధవారం మధ్యాహ్నం తమ్మిలేరు సమీపాన ఉన్న గేదెల కోసం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రామారావు ఆచూకీ కోసం స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తమ్మిలేరులో వరద ఎక్కువగా ఉండడంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు.

# చోరీకి వెళ్లిన దొంగలకు చుక్కెదురు!

**ఇంట్లో ఏమీ దొరక్కపోవడంతో వెనుదిరిగిన దుండగలు**

పాల్వంచ: తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. కానీ, ఎలాంటి విలువైన వస్తువులు దొరక్కపోవడంతో సామగ్రి చిందరవందర చేసి, వెనుదిరుగాల్సి వచ్చింది. బుధవారం పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన సతీశ్‌రెడ్డి పనిమీద బయటకు వెళ్లాడు. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో పట్టపగలే దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తాళాలు, కబోర్డులను పగులగొట్టి ఇంట్లోని సామగ్రిని చెల్లాచెదురు చేశారు. ఎక్కడా విలువైన వస్తువులు దొరక్కపోవడంతో వెళ్లిపోయారు. కొంత సేపటి తర్వాత సతీశ్‌రెడ్డి వచ్చే సరికి ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎలాంటి వస్తువులు పోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పట్ట పగలే దొంగలు చోరీకి యత్నించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చోరీకి యత్నించిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

# 12 కేజీల గంజాయి పట్టివేత

మణుగూరురూరల్: మండలంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో 12.82 కేజీల గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం స్వాధీనం చేసుకుంది. ఖమ్మం ఎస్టీఎఫ్ ఏఈఎస్ తిరుపతి వివరాలు వెల్లడించారు. గంజాయి, మద్యానికి అలవాటు పడిన మహబూబాబాద్, జనగాంలకు చెందిన నలుగురు యువకులు రెండు బైకులపై సీలేరుకు చేరుకుని రెండు రోజుల పాటు అక్కడే ఉండి ఒడిశా నుంచి 12.82 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. దీనిని రెండు ద్విచక్ర వాహనాలపై మహబూబాబాద్ తీసుకొస్తున్న క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ ఏఈఎస్ తిరుపతి, సీఐ సుంకరి రమేశ్ సిబ్బందితో కలిసి మణుగూరు హనుమాన్ టెంపుల్ సమీపంలో గల రథంగుట్ట పార్క్ వద్ద మాటువేసి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న సంచులను తనిఖీ చేయగా.. 12.82 కేజీల గంజాయి లభ్యమైందని తిరుపతి తెలిపారు. గంజాయిని తరలిస్తున్న రేగు సంపత్, నందమాల లవ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన బందేల్ సాయికుమార్, బోడ వంశీని అరెస్ట్ చేయగా.. మహబూబాబాద్‌కు చెందిన జానీ పరారైనట్లు ఆయన తెలిపారు. నిందితుల వద్ద నుంచి రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఎండీ ఆరీఫ్, కానిస్టేబుళ్లు సుధీర్, హన్మంతరావు, వెంకటేశ్, హరీశ్, విజయ్‌లు పాల్గొన్నారు.



గంజాయి, నిందితులను చూపుతున్న అధికారులు

# ప్రమాదానికి గురైన 108 వాహనం

సింగరేణి(కొత్తగూడెం): రామవరం బస్టాండ్ సెంటర్ సమీపంలోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాన్ని తెల్లవారుజామున 108 వాహనం ఢీకొంది. టేకులపల్లికి చెందిన గర్భిణిని 108 ద్వారా రామవరంలోని మాతా శిశు ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. రామవరం సెంటర్లో ఆవు అడ్డు రాగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్క ఉన్న లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహాన్ని ఢీకొంది. కాగా, గర్భిణిని వెంటనే ఆటోలో ఆస్పత్రికి తరలించారు. కాగా, వాహనం ఢీకొట్టడంతో సుమారు 60 ఏళ్ల కిందట నిర్మించిన విగ్రహం ధ్వంసమైంది. కాగా, కాంగ్రెస్ నాయకులు ఈ ఘటనపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



దెబ్బతిన్న 108 వాహనం

## 27న తిరుమలకు మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నా రు. ఈనెల 27 శుక్రవారం రాత్రికి ఆయన తిరుమల చేరుకుంటున్నారు. మరుసటి రోజు (28న), శనివారం ఉదయం ఆయన స్వామివారిని దర్శించుకుంటారు.

## చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న ఆలయాల్లో పూజలు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు

సాక్షి, అమరావతి: తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేసినందుకు, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ఈ నెల 28న (శనివారం) ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. తిరుమల పవిత్రతను, వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం విశిష్టతను, స్వామి వారి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేశారని అన్నారు. కావాలని అబద్ధాలాడి, జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా చిత్రీకరిస్తున్నారని, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు తిరుమలను, తిరుమల లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో శనివారంనాడు ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలి

### బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ, నీలిమ మెడికల్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించేంత వరకు మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్, కాళోజీ నారాయణ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వారిద్దరిని పదవుల నుంచి తొలగించాలని కోరారు.

# బాబు కుట్రకు పోలీసు వత్తాసు

**వేధించి తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే కుతంత్రం ● లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో చంద్రబాబు పన్నాగం**

- వీర విధేయ పోలీసు అధికారులతో 'సిట్'
- సిట్ ఏర్పాటు తరువాత కూడా పోలీసులకు ఫిర్యాదు
- ముందు రోజు రాత్రే సీఐని వీఆర్‌కు పంపిన ప్రభుత్వం
- తమ అనుకూల అధికారిని నియమించిన తరువాతే ఫిర్యాదు
- ఇప్పటికే వీర విధేయులతో 'సిట్'.. తాజాగా పోలీసు అస్త్రం
- తమ కుట్రను ప్రశ్నిస్తున్న వారిని వేధించేందుకు చంద్రబాబు వ్యూహం
- నెయ్యిపై రాద్ధాంతం అంతా తమ అనుకూల డెయిరీలకు కాంట్రాక్టు ఇప్పించి తెర వెనుక హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చేందుకే

సాక్షి, అమరావతి: తిరుపతి లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారం బెడిసికొట్టడంతో సీఎం చంద్రబాబు కొత్త కుట్రకు తెర తీశారు. అవాస్తవ ఆరోపణల కుతంత్రం తన మెడకే చుట్టుకుంటుండంతో ఆయన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించలేకపోవడంతో ఆ వివాదమంతా టీడీపీ ప్రభుత్వ సృష్టేనని జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ అంశంపై మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టు తలుపు తట్టడంతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ అంశంపై న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుంటే తన కుట్ర బట్టబయలవుతుందని బెంబేలెత్తుతున్నారు. దీంతో తాను సృష్టించిన వివాదాన్ని తనకు అనుకూలంగా ముగించేందుకు చంద్రబాబు దారులు వెతుకుతున్నారు. అందులో భాగంగానే టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో 'సిట్'ఏర్పాటు చేసినప్పటికీ ఆయన స్థిమితపడలేకపోతున్నారు. అందుకే లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో టీటీడీ అధికారులతో బుధవారం ఫిర్యాదు చేయించారు. పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తిమ్మిని బమ్మి చేసే కుతంత్రానికి పదును పెడుతున్నారు.

### పక్కా పన్నాగంతోనే పోలీసులకు ఫిర్యాదు

లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూనే చంద్రబాబు ప్రభుత్వం పోలీసు అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధ పడింది. కల్తీ నెయ్యి సరఫరా చేశారని గుర్తించామని చెబుతున్న రెండు నెలల తరువాత టీటీడీ తీరిగ్గా తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఫిర్యాదు చేయడం గమనార్హం. తమిళనాడుకు చెందిన నెయ్యి సరఫరాదారు ఏఆర్ డెయిరీపై టీటీడీ జనరల్ మేనేజర్ (స్టోర్స్) పి.మురళీకృష్ణ ద్వారా ప్రభుత్వం ఫిర్యాదు చేయించింది. నెయ్యి కల్తీ జరిగిందని జూలై 23నే టీటీడీకి నివేదిక వచ్చిందన్న చంద్రబాబు సెప్టెంబరు 20న తొలిసారిగా వెల్లడించి దుష్ప్రచారానికి తెరతీశారు. మరి కల్తీ జరిగిందని తెలిసిన జూలై 23నే ఆహార భద్రతా చట్టం కింద టీటీడీ ఎందుకు కేసు నమోదు చేయలేదన్న న్యాయ నిపుణుల ప్రశ్నకు ప్రభుత్వం సూటిగా సమాధానం చెప్పలేక పోయింది. టీటీడీ ఈవో శ్యామలరావు మొదట ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ కలిసిందని... అయితే ఆ నెయ్యి వాడలేదని.. తిప్పి పంపామని వెల్లడించారు. అంతేగానీ జంతువుల కొవ్వు కలిసిందని ఆయన చెప్పలేదు. జంతువుల కొవ్వు కలిసినట్లు ఎన్‌డీడీబీ నివేదికలో కూడా వెల్లడించలేదు. కానీ తరువాత ఈ నెల 20న సీఎం చంద్రబాబు కుట్రపూరితంగా నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందనే దుష్ప్రచారం మొదలు పెట్టడంతో శ్యామలరావు కూడా మాట మార్చక తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలోని డొల్లతనంపై నిపుణులు సూటిగా ప్రశ్నలు సంధిస్తుండటంతో చంద్రబాబు బెంబేలెతున్నారు. దాంతో తమను ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేసేందుకు పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారాన్ని పతాకస్థాయికి చేర్చిన చంద్రబాబు బృందం తాజాగా తిరుపతి పోలీసులకు ఫిర్యాదు ముసుగులో వేధింపుల కుట్రకు తెర తీసింది.

### హెరిటేజ్ కోసమే ఇదంతా..!

"టీటీడీకి సరఫరా అయ్యే నెయ్యిపై రాద్ధాంతం చేసి వివాదాన్ని సృష్టించడం ద్వారా తమకు అనుకూలంగా నడుచుకునే కొన్ని ప్రైవేట్ డెయిరీలతో కలసి సిండికేట్‌గా ఏర్పడి హెరిటేజ్‌కు అడ్డగోలుగా వ్యాపార ప్రయోజనాలు కల్పించాలని సీఎం చంద్రబాబు ఎత్తుగడ వేసినట్లు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు సైతం చర్చించుకోవడం గమనార్హం. ఏదో ఒక డెయిరీకి కాంట్రాక్టు ఇప్పించి తెర వెనక హెరిటేజ్ కార్యకలాపాలు సాగించేలా పథకం వేసినట్లు పేర్కొంటున్నారు"



- తిరుపతి ఈస్ట్ పోలీసులకు టీటీడీ బుధవారం ఫిర్యాదు చేసింది. అయితే ఆ ముందు రోజే అంటే మంగళవారం రాత్రే తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం హఠాత్తుగా వీఆర్‌కు పంపించింది. ఆయన స్థానంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న తమకు విధేయుడైన ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించింది. లడ్డూ అంశంపై అక్రమ కేసు నమోదు చేసేందుకు మహేశ్వర్‌రెడ్డి సుముఖత చూపలేదని సమాచారం. దాంతో ఆయన్ని తప్పించి తమకు విధేయుడైన అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసే ఫిర్యాదులపై విచారణ నిర్వహించాల్సిన బాధ్యత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌దే. టీడీపీ ప్రధాన కార్యాలయం చెప్పినట్లుగా దర్యాప్తు పేరిట వేధింపులకు పాల్పడే అధికారిని నియమించుకునేందుకే ఈ ఎత్తుగడ వేసినట్లు స్పష్టమవుతోంది.

### మరి.. నాడు బాబు హయాంలోనూ కల్తీ జరిగిందా?

నెయ్యి కల్తీ జరిగినట్లు ప్రాథమిక ఆధారంగా టీటీడీ ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన అంశం విడ్డూరంగా ఉంది. కేజీ నెయ్యి రూ.319.80 చొప్పున సరఫరా చేసేందుకు ఏఆర్ డెయిరీ అంగీకరించడమే కల్తీ చేశారనేందుకు ప్రాథమిక ఆధారం అని పేర్కొనడం గమనార్హం. మరి కేజీ రూ.319.80 చొప్పున సరఫరా చేయడమే కల్తీ చేసినట్టుగా భావించాలంటే.. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2015లో కేజీ రూ.276 చొప్పున, 2018లో రూ.320 చొప్పునే టీటీడీ నెయ్యి కొలుగోలు చేసింది. ఇక అప్పుడు కూడా కల్తీ చేసినట్లే భావించాలి కదా...? నాడు టీడీపీ హయాంలో నెయ్యి సరఫరా చేసిన డెయిరీలపై కూడా ఫిర్యాదు చేయాలి కదా? అని నిపుణులు నిలదీస్తున్నారు.

### సిట్ వేశాక పోలీసులకు ఫిర్యాదా...!

లడ్డూ ప్రసాదం అంశంపై ప్రభుత్వం మంగళవారం తమకు వీర విధేయులైన పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు కొమ్ము కాసిన గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇక సిట్‌లో సభ్యుడిగా నియమించిన విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య అల్లుడు. రిటైరైన తరువాత హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా పని చేసిన కృష్ణయ్య అనంతరం 2014–19లో టీడీపీ హయాంలో ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన్ని కూటమి ప్రభుత్వం తాజాగా రాష్ట్ర కాలుష్య నియమంత్రణ మండలి చైర్మన్‌గా నియమించింది. ఆయన అల్లుడు గోపీనాథ్ జెట్టీని సిట్ సభ్యుడిగా నియమించడం ద్వారా చంద్రబాబు కుతంత్రం బహిర్గతమవుతోంది. అయినా సరే చంద్రబాబులో ఆందోళన తగ్గలేదు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని జాతీయ స్థాయిలో పార్టీలు, నిపుణులు, న్యాయవేత్తలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. తన వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో చంద్రబాబులో ఆందోళన మరింత తీవ్రమైంది. సుప్రీంకోర్టు విచారణకు ఆదేశిస్తే టీడీపీ సర్కారు కుట్ర మొత్తం బయటపడుతుందన్నది ఆయనకు తెలుసు. తమ కుట్రను కప్పిపుచ్చేందుకు సిట్‌తో సరిపెట్టలేమని భావించారు. అందుకే పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తనకు అనుకూలంగా లొంగదీసుకునే కుతంత్రానికి తెరతీశారు. తాజాగా తిరుపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం ద్వారా మరోవైపు నుంచి కూడా విచారణ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

### విచారణ పేరిట వేధింపుల కుట్ర..

రాజకీయ ప్రత్యర్థులు, డెయిరీల యాజమాన్యం, ఎంపిక చేసుకున్న అధికారులు, ఉద్యోగులపై వేధింపులకు పాల్పడాలన్నదే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర. అక్రమ కేసుల్లో ఇరికించి అనంతరం కొందర్ని అప్రూవర్‌గా మార్చుకుని తమ కుట్ర వాదనను వారితో ఒప్పించాలనే కుతంత్రం పన్నింది. సిట్ పూర్తి స్వరూపాన్ని ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. నివేదికతో సరిపెట్టాలా? అంతకుమించి అధికార పరిధి కల్పిస్తారా? అనేది స్పష్టం చేయలేదు. మరోవైపు తిరుపతి పోలీసులు కేసు విచారణ పేరిట వేధింపులకు గురి చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. అమరావతిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం డైరెక్షన్ మేరకే తిరుపతి పోలీసుల విచారణ హైడ్రామా కొనసాగనుంది. ఎవరెవరిని విచారణకు పిలవాలి..? ఎలా భయపెట్టాలి..? ఎలా వేధించాలన్నది అంతా టీడీపీ పర్యవేక్షణలోనే సాగనుందన్నది సుస్పష్టం. లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారానికి వత్తాసు పలకాలని.. తప్పుడు వాంగ్మూలాలు ఇవ్వాలని... లేదంటే కేసుల్లో ఇరికించి అరెస్టులతో వేధిస్తామని పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలన్నది చంద్రబాబు కుతంత్రం అని స్పష్టమవుతోంది.



మహేశ్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

## కుల గణన.. కాంగ్రెస్ పేటెంట్

- నాలుగైదు రోజుల్లో విధి విధానాలు పూర్తిచేస్తాం
- బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సనత్‌నగర్ (హైదరాబాద్): కులగణన కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, అది జరగనిదే స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ల నియామకాల్లో కూడా నలుగురు బీసీలకు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చెప్పారు. 'సమగ్ర కుల గణన–బీసీ రిజర్వేషన్ల పెంపుపై'బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, కులగణన అంశాన్ని తెర మీదకు తీసుకువచ్చిన నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎవరికి దక్కాల్సిన ఫలాలు వారికి అందాలనే ఉద్దేశంతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించడం జరిగిందని గుర్తుచేశారు. నాలుగైదు రోజుల్లో కులగణనపై విధి విధానాలను ఖరారు చేసి ఆ దిశగా ముందుకు సాగుతామన్నారు. రాష్ట్ర ఖజానా అధ్వాన్న స్థితిలో ఉందని, నెలసరి ఆదాయం 18 వేల కోట్లు కాగా, గత ప్రభుత్వం చేసిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు తీర్చేందుకే ఎక్కువ శాతం ఆదాయం కేటాయిస్తూ వస్తున్నట్లు చెప్పారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అనవసర ప్రాజెక్టులతో దుబారా చేసి అప్పులపాలు చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ కులగణన అంశాన్ని లేవనెత్తగానే బీజేపీ కూడా స్వరం మార్చి ఆర్ఎస్ఎస్‌తో మద్దతు తెలియజేస్తోందన్నారు. బీజేపీ హయాంలో పెట్టుబడిదారులకు న్యాయం జరిగిందే తప్ప ప్రజలకు జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నష్టాల్లో ఉన్న సంస్థలను ప్రైవేటీకరణ చేసిందే తప్ప లాభాల్లో ఉన్న వాటి జోలికి వెళ్లలేదని, నేడు బీజేపీ లాభాల్లో ఉన్న సంస్థలను కూడా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ కూడా కులగణనకు మద్దతు అంటూ ఇప్పుడు చెబుతోందని, గత పదేళ్ల ఆ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా కులగణన జరిపి తీరుతామని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు.

**జిల్లా వార్తలు**

## రామయ్య సన్నిధిలో పూజలు



ఆలయంలో సుజాతగుప్తా తదితరులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామి వారిని బుధవారం తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతగుప్తా దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో పూజలు చేయగా, పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందించారు. అలాగే, ఏపీలోని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష కూడా కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## గీతకార్మికులకు కాటమయ్య కిట్లపై శిక్షణ



గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుండాల: కల్లుగీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్లు అందిస్తుండగా బుధవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఆళ్లపల్లి మండలం మర్కోడులో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర మాట్లాడుతూ.. జిల్లాలో 185 మందికి కిట్లు ఇవ్వనుండగా, వినియోగంపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. తాటిచెట్టు ఎక్కి, దిగే క్రమాన ప్రమాదాలకు గురికాకుండా ఈ కిట్లు ఉపయోగపడతాయని, రూ.15 వేల విలువైన ఈ కిట్.. 300 కేజీల బరువు మోసేలా రూపొందించారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ ఉద్యోగులు మానస, నాగానంద్, యాకూబ్‌పాషా, వెంకటేశ్వర్లు, గీత కార్మికులు తాళ్లపల్లి వెంకన్న, శ్రీరాం సమ్మయ్య, బత్తిని సాయన్న, యాసారపు బాబు, యాసారపు వెంకన్న, బొంగు సిద్ధయ్య, కాసబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రకృతితో మమేకం!



నైవేద్యానికి సిద్ధం చేసిన వంటకాలతో ఆదివాసీలు

- విభిన్నంగా ఆదివాసీల జీవనం
- వారసత్వాన్ని పరిరక్షించుకునేలా 'కొత్తల పండుగ'
- ఆదివాసీ గూడేల్లో కొనసాగుతున్న వేడుకలు

కరకగూడెం: పట్టణీకరణకు దూరంగా జీవనం సాగించే ఆదివాసీలు ఏళ్ల గడిచినా తమ సంస్కృతి, సంప్రదాయాలను మాత్రం కొనసాగిస్తూనే ఉంటారు. ఇందులో భాగంగానే వారి జీవన శైలిని ప్రతిబింబించే పండుగలను జరుపుకుంటారు. ఏటా ఆదివాసీలు ప్రధానంగా ఆరు పండుగలు నిర్వహిస్తారు. భూమి పండుగ, పొట్ట పండుగ, వెన్నుగంటి పండుగ, కొత్తల పండుగ (పెద్దల పండుగ), మండమెలిగే పండుగ, చిక్కుడు పండుగగా పిలిచే వీటిని నియమిత రోజుల్లో జరుపుకుంటారు. ప్రకృతికి అనుబంధంగానే జరిగే కొత్తల (పెద్దల) పండుగను వారం రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆదివాసీలు జరుపుకుంటున్న నేపథ్యాన కథనం.

**గిరిజన వారసత్వ పరిరక్షణ**

తరతరాల వారసత్వాన్ని పరిరక్షించుకోవడమే కొత్తల పండుగ ప్రధాన ఉద్దేశమని ఆదివాసీలు నమ్ముతారు. వానాకాలంలో మొదట్లో సాగు చేసే పంట చేతికొచ్చిన సందర్భంగా ప్రకృతి, దేవతలను కొలిచి వారికి నైవేద్యాలు సమర్పించాకే పంట, కూరగాయలు, పండ్లను ఆదివాసీలు భుజించడం ఆనవాయితీ. ఉత్తర కార్తె మొదటి వారం అంటే సెప్టెంబర్‌లో పెద్దల పండుగ జరుపుకుంటారు. గూడెంల వారీగా ఒక్కోరోజు పండుగ జరుపుకుంటుండగా.. ఇంటిని అలికి ముగ్గులు వేస్తారు. గుమ్మానికి మామిడి, వేపాకులతో తోరణాలు కట్టి మొక్కజొన్న కానీ వరి కంకులను కానీ తోరణాల మధ్య కడతారు. ఆపై పెద్ద మనుషులు తెల్ల పంచె కట్టుకుంటారు. ఆ తర్వాత సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ, ముత్యాలమ్మ, కొమ్మలమ్మ, ముసలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, మూగరాజు, గాదె రాజు, బాల కుమారస్వామి, కాతూరుడు మొదలగు ఇలవేల్పులను కొలుస్తారు. ఆపై కోడిపెట్టను అర్పించి పాల ఆకులు, ఇప్పఆకులు ఇంటికి తీసుకొస్తారు. నూకల బియ్యాన్ని వడ్డె కుటుంబ సభ్యులందరికీ ఇస్తాడు. అంతేకాక ఈ ఏడాది కాలంలో చనిపోయిన వారు, మూడు తరాల వారిని స్మరించుకుంటారు.



నైవేద్యం సమర్పిస్తున్న ఆదివాసీలు


**కొత్త కోడలి గోత్రం మార్పిడి**

ఈ పండుగ సందర్భంగా గూడెం మొత్తం సందడి నెలకొంటుంది. ఉన్నంతలో కోడి కూర వంటివి సిద్ధం చేసి అన్నం వండాక వంశ సభ్యులందరికీ వడ్డిస్తారు. శానార్తి సెలవు పదంతో సెలవు అడిగి భోజనం చేస్తారు. ఆపై కొత్తగా పెళ్లయి అత్తారింటికి వచ్చిన యువతి ఆమె పుట్టింటి వారి గట్టు, గోత్రాలను విడిచి తన భర్త గట్టు, గోత్రాలలోకి మార్పిడి చెందుతుంది. మరునాడు ఉదయం పెద్దలు పెతర్ల పేరుతో అన్నదానం, వస్త్రదానం చేసి పండుగ ముగిసిందని భావిస్తారు.

**ప్రకృతి ఆరాధన**

కొత్తల పండుగ గిరిజనులకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ పండుగను ప్రాంతాల వారీగా జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి వెనుక కోతల దేవిని గౌరవించడడంతో పాటు అడవులు, వన్య ప్రాణులు, తెగలను రక్షించే దేవతను ఆరాధించి ఆశీర్వాదం పొందడం ఉంటుంది. ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపి ప్రకృతి అనుగ్రహం పొందడానికి, ఆదివాసీ వర్గాల మధ్య సామాజిక సంబంధాలు, ఐక్యతను బలోపేతం చేయడానికి పండుగ ఉపకరిస్తుందని భావిస్తారు.


### దేవతల ఆశీస్సులు పొందుతాం



కొత్తల పండుగ గృహాలు, దేవాలయాలను శుభ్రపరచడం, అలంకరించడం ద్వారా ప్రారంభమవుతుంది. దేవతలకు ప్రార్థన చేసి పూలు, పండ్లు సమర్పించి ఆశీస్సులు పొందుతాం. ఆచారాలను గౌరవిస్తూ వేడుక జరుపుకుంటాం. పూర్వీకుల వారసత్వంగా సంతోషకరమైన వాతావరణంలో పండుగ సాగుతుంది.

–కుడం జోగమ్మ, అంగారుగూడెం

### ప్రకృతి వేడుక 'కొత్తల పండుగ'..



ఆదివాసీలు జరుపుకునే కొత్తల పండుగ ప్రకృతి వేడుక వంటిది. ఇది ఆదివాసీ వర్గాల గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. బంధాలను బలపరిచి ఐక్యతను ప్రోత్సహిస్తుంది. సంప్రదాయ పద్ధతులు, సంగీతం, నృత్య రూపాలను సంరక్షించడమే కాక పర్యావరణం, ప్రకృతి పరిరక్షణకు ఉపయోగపడుతుంది.

–తోలెం రమేశ్, ఆధార్ స్వచ్ఛంద స్వంస్థ వ్యవస్థాపకులు

## సీఎం సహాయ నిధికి 'శ్రీ చైతన్య' రూ.25లక్షల విరాళం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి శ్రీచైతన్య విద్యాసంస్థల తరఫున రూ.25లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తూనే సామాజిక బాధ్యత నిర్వర్తించడంలో తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎల్లప్పుడు ముందుంటాయని తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌ను సీఎం అభినందించారు. ఈకార్యక్రమంలో తుమ్మల యుగంధర్, శ్రీచైతన్య డైరెక్టర్ రవితేజ, పాఠశాలల డీజీఎం చేతన్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు చెక్కు ఇస్తున్న మల్లెంపాటి శ్రీధర్

## గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

భద్రాచలం: ఏజెన్సీ పరిధిలోని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ శరత్ హైదరాబాద్ నుంచి పలువురు అధికారులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. గిరిజన ఆవాసాల్లోని ప్రైమరీ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో వసతులు కల్పించడమే కాక తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, గ్రామీణ సడక్ యోజన పథకం కింద రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పీఎం జన్మన్ పథకం కింద కొండరెడ్ల గ్రామాల్లో రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్లు, కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. భద్రాచలం, టేకులపల్లిలో ఈఎంఆర్‌ఎస్ పాఠశాలలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు భద్రాచలం నుంచి పీఓ మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు నరేశ్, దావీద్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న పీఓ రాహుల్, అధికారులు

## షరతులు లేకుండా లాభాల వాటా చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): ఎలాంటి షరతులు విధించకుండా సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేల చొప్పున చెల్లించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర కార్యదర్శి పెద్దబోయిన సతీశ్ కోరారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్, రైటర్‌బస్తీ, బాబుక్యాంపు తదితర ప్రాంతాల్లో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో 25 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఏడాది లాభాల వాటా నుంచి రూ.5 వేల చొప్పున చెల్లించేందుకు నిర్ణయించారని తెలిపారు. కానీ, కొందరు అధికారులు మస్టర్ల ప్రతిపాదికన నిర్ణయిస్తామని చెప్పడం సరికాదని, ఈపీఎఫ్, సీఎంపీఎఫ్ కలిగిన ప్రతీ కార్మికుడికి చెల్లించాలని కోరారు. అలాగే, ఖాళీ క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు సుజాత, సురేశ్, శారద, ఆదిలక్ష్మి, మణెమ్మ, మల్లేశ్, రాధాకృష్ణ, పుష్పరాజ్, నరసింహ, రాజు, కరుణ, తార, పద్మ, నిర్మల, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఇఫ్టూ నాయకులు

## యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

భద్రాచలంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఆయుష్ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. పార్ట్ టైం విధానంలో భర్తీ చేసే ఈ పోస్టుల్లో పురుషులు, మహిళలకు సగం సగం కేటాయించినట్లు ఆయుష్ భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు తెలిపారు. అర్హతలు, దరఖాస్తు వివరాలను HTTPS://AYUSH.TELANGANA.GOV.IN/ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని పేర్కొన్నారు. ఎస్సెస్సీ లేదా ఇంటర్ విద్యార్హత కలిగిన వారు ఈనెల 30వ తేదీన ఉదయం ఖమ్మం హోమియో ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అర్హులు, ఆసక్తి కలిగిన వారు జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటేశ్వరరావు (99493 79353) లేదా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మహేశ్‌గౌడ్ (90632 38363)ను సంప్రదించాలని అధికారులు తెలిపారు. ఎంపికైన వారికి గంట పాటు కొనసాగే సెషన్‌కు రూ.250 చొప్పున రెమ్యునరేషన్ అందుతుంది.

## ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా దేవరకొండ



దేవరకొండ సైదులు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఎన్నికను ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం ఖమ్మంలోని ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో సైదులును సంఘం నాయకులు అభినందించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మల్సూర్, సురేశ్, పాశం శ్రీనివాసరావు, వెంకన్న, సుధాకర్‌రెడ్డి, కరీముల్లా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.